ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





ఈనాడు కార్యాలయంపై రాళ్లు రువ్వుతున్న వైసీపీ కాటసాని అనుచరులు



చెలరేగిన వైసీపీ మూకలు

- ఈనాడు కార్యాలయంపై దాడి
- రాళ్లు, కర్రలతో దూసుకొచ్చిన వైసీపీ శ్రేణులు
- ఈనాడు ప్రతులకు నిప్పు పెట్టి నినాదాలు చేసిన వైనం
- మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరిపై వైసీపీ మూకల దాడి

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పాలకుల అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకురావడం పత్రికలు, పాత్రికేయుల కనీస ధర్మం. అందులో నిజం లేకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చు. ఇందుకు విరుద్ధంగా వ్యతిరేక కథనాలు రాస్తున్నారనే అక్కసుతో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వైసీపీ మూకలు దాడికి తెగబడుతున్నాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ పాల్గొన్న సిద్ధం సభలో ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు మూకుమ్మడిగా దాడికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఆ ఘటనను మరువకముందే కర్నూలు జిల్లాలో వైసీపీ శ్రేణులు, ఆ పార్టీ మూకలు దాడులకు తెగబడ్డాయి. వ్యతిరేక కథనాలు రాశారనే అక్కసుతో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై దాడులకు దిగి బీభత్సం సృష్టించారు. హౌసింగ్ బిల్లుల చెల్లింపులో అక్రమ వసూళ్లపై వార్త రాశారంటూ మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌పై వైసీపీ మూకలు దాడికి దిగి చేతులతో కొట్టి, చొక్కాలు చింపేశారు. ఇది ప్రజాస్వామ్యమా...? రాజారెడ్డి రాజ్యమా..? అంటూ ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

- ఈనాడు ఆఫీసుపై దాడి.. బీభత్సం

కర్నూలు నగరం నడిబొడ్డున రాజ్ థియేటర్ ఎదురుగా ఉన్న ఈనాడు లోకల్ ఆఫీసుపై మంగళవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడి దాడికి దిగారు. బీభత్సం సృష్టించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా వార్తలు రాస్తారా..? మీ అంతు చూస్తామంటూ ఆయన ముఖ్య అనుచరులు, నగర పాలక సంస్థ కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, మైతాపి నరసింహులు, వైసీపీ యువజన విభాగం నాయకుడు అక్కిమి హనుమంతరెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వందలాది మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఈనాడు ఆఫీసుపై దాడికి దిగారు. పెద్ద ఎత్తున కేకలు వేస్తూ కర్రలు, రాళ్లతో స్వైరవిహారం చేశారు. అద్దాలు పగులకొట్టారు. తలుపులు ధ్వంసం చేసి ఆఫీసులో ఉన్న ఈనాడు ప్రతులను రోడ్డుపైకి తీసుకువచ్చి నిప్పు పెట్టి రాక్షసానందం పొందారు. దాదాపు గంటన్నరకు పైగా నిత్యం రద్దీ ఉండే రాజ్‌థియేటర్ సర్కిల్‌లో బీభత్సం సృష్టించారు. సీఐలు ఇంతియాజ్ బాషా, శంకరయ్య, పవన్ కుమార్, రామయ్య నాయుడుతో పాటు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని వారిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయినా ఏమాత్రం భయపడకుండా వైసీపీ మూకలు ఈనాడు కార్యాలయంపైకి వెళ్లి తలుపులు బద్దలు కొట్టారు. రాళ్లు రువ్వి అద్దాలు ధ్వంసం చేశారు. వైసీపీ నాయకుల చేష్టలతో వ్యాపారులు భయంతో దుకాణాలు మూసుకుని పారిపోవాల్సి వచ్చింది. ఈ ఘటనపై సీఐ ఇంతియాజ్ బాషాను వివరణ కోరగా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైసీపీ దాడికి గురైన ఈనాడు కార్యాలయాన్ని ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పరిశీలించారు. ఆయన వెంట ఐజేయు జాతీయ సమితి సభ్యుడు జి.కొండప్ప, కె.నాగరాజు, ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసులు గౌడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకన్న, కోశాధికారి అంజి, నాయకులు శివ, అవినాశ్, స్నేహాల్, ఉశేని, తదితరులు ఉన్నారు.



వైసీపీ జెండాలతో హల్‌చల్ చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ దాడి

- చొక్కా చింపి పిడిగుద్దులు గుద్ది..
- ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలోనే పెట్రేగిన వైసీపీ మూకలు



ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న వీరశేఖర్ తదితరులు

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ: 'హౌసింగ్ బిల్లుల్లో అక్రమాలపై వార్తలు రాస్తావా..? నీకెంత ధైర్యముంటే మాపై వార్తలు రాస్తావ్..? మీ అంతు చూస్తాం..' అంటూ వైసీపీ నాయకులు మూకుమ్మడిగా మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌పై దాడికి దిగారు. మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హెల్త్ క్లీనిక్, మద్దికెర-బీఎన్‌పేట రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమం కవరేజీ కోసం ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌తో పాటు వివిధ పత్రికలు, మీడియా పాత్రికేయులు సైతం వెళ్లారు. ప్రోగ్రాం సమీపంలో విలేకరులు వార్తసేకరణలో ఉండగా.. మద్దికెరకు చెందిన వైసీపీ నాయకుడు, వీఆర్వో తమ్ముడైన రంగస్వామి, మరికొంత మంది వైసీపీ నాయకులు ఒక్కసారిగా పేపరులో రాయడానికి వీలుకాని పదాలతో దూషిస్తూ దాడికి తెగబడ్డారు. వీరశేఖర్ చొక్కా పట్టుకుని, చొక్కా చింపేసి చేతులతో బలంగా కొట్టారు. ఊహించని సంఘటనతో మేల్కొన్న పక్కనే ఉన్న ఈనాడు విలేకరి తిక్కన్న, తెలుగు ప్రభ విలేఖరి సుల్తాన్‌బాషా తదితరులు అడ్డుకుని శేఖర్‌కు రక్షణగా నిలిచారు. అక్కడి నుంచి వారు వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయంపై మద్దికెర ఎస్‌ఐ రమేష్‌బాబుకు బాధిత విలేకరి వీరశేఖర్ స్థానిక విలేకరులతో కలిసి ఫిర్యాదు చేశారు.

ఉదయం అలా...



సాయంత్రం ఇలా...



అధికారుల మధ్య కూర్చున్న ఈయన.. చేయి పైకెత్తి కేకలు వేస్తున్న ఆయన ఇద్దరూ ఒక్కరే. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బెల్లం మహేశ్వరరెడ్డి చైర్మన్ హోదాలో ఇలా హాజరు కాగా... సాయంత్రానికి ఈనాడు కార్యాలయంపై జరిగిన దాడిలో నినాదాలు చేస్తూ, కేకలు వేస్తూ ఇలా కనిపించారు.



పలుకూరులో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

వృథా కేంద్రాలు

- రూ. కోట్లు నిరుపయోగం
- దేనికీ పనికిరాని చెత్త కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

గ్రామ పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి, దాన్ని అమ్మి, తద్వారా వచ్చే డబ్బుతో గ్రామ పంచాయతీలకు ఆదాయం పెంచాలని గత టీడీపీ ప్రభుత్వం చెత్త కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయం పెరిగింది. ఆర్థికంగా బలోపేతం అయ్యాయి. ఈ సదుద్దేశాన్ని వైసీపీ ప్రభుత్వం సమూలంగా దెబ్బతీసింది. టీడీపీ హయాంలో జిల్లాలో పలు చోట్ల నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నేడు నిరుపయోగం అయ్యాయి. కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద నిర్మించిన చెత్త సంపద వృద్ధి కేంద్రాల లక్ష్యంపట్ల ఈ ప్రభుత్వానికి లక్ష్యం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బనగానపల్లె, ఫిబ్రవరి 20: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సందప ఉత్పత్తి చేయాలనే గత టీడీపీ ప్రభుత్వం అనుకుంది. నిరుపయోగమైన చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయడం వల్ల రైతులకు కూడా ఉపయోగం ఉంటుంది. దీని కోసం గ్రామాల్లో సేకరించే చెత్తను పొడి చెత్త, తడిచెత్తగా వేరు చేసి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గ్రామ పారిశుధ్య కార్మికులతో సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించే విధానాన్ని చేపట్టింది. చాలా కాలం బాగా పని చేసిన ఈ కేంద్రాలు వైసీపీ పాలన ఆరంభం కాగానే చాలా చోట్ల పని చేయడం ఆగిపోయింది. నిరుపయోగమైన చెత్తను ఉపయోగకరంగా తయారు చేయాల్సిన ఈ కేంద్రాలే నిరుపయోగంగా మారిపోయాయనే విమర్శలు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో 637 చెత్త సంపద కేంద్రాలు పూర్తి : ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 713 చెత్త సంపద కేంద్రాలు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. వాటిలో 713 కేంద్రాలకు నిధులు మంజూరు అయ్యాయి. రూ.23.97 కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. ఇందులో 59 కేంద్రాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. బనగానపల్లె మండలంలో మొత్తం 10 చెత్త సంపద కేంద్రాలు పూర్తి కాగా మీరాపురం, బనగానపల్లె పట్టణంలో నిర్మాణంలో ఉన్నాయి. రెండు గ్రామాల్లో నిర్మాణాలు ఆగిపోయాయి. పాతపాడుతో పాటు మరో రెండు గ్రామాల్లో మాత్రమే పని చేసేవి. అవి కూడా ప్రస్తుతం మూతపడ్డాయి. కారణం పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో వాటిని నిర్వహించే గ్రామ సర్పంచ్‌లు చేతులెత్తేశారు. చెత్త సంపద కేంద్రాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో గ్రామ పంచాయితీ అధికారులు చెత్త సంపద కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు తయారుచేసే ప్రక్రియను నిలిపవేశారు. దీంతో మిగతా 7 చోట్ల నిరుపయోగంగా మారిపోయాయి.

నందవరంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



బనగానపల్లెలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పనిచేయని చెత్త సంపద కేంద్రాలు : చెత్త సంపద కేంద్రాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పనిచేసే చెత్త సంపద కేంద్రాలు కూడా దాదాపుగా మూతపడ్డాయి. ఈ కేంద్రాల్లో పనిచేసే వారికి గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు చెల్లించేవి. వేతనాలు లేక అందులో పనిచేసే కార్మికులు పనులు మానుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా కేంద్రాలు

ఉమ్మడి జిల్లాల్లో కేవలం 10 శాతం చెత్త సంపద కేంద్రాల్లో మాత్రమే సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. మిగతా చోట్ల తయారు చేయడం లేదు. దీంతో చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాల నిలయంగా మారిపోయాయి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి. దీంతో గత ప్రభుత్వ ఆశయం నిర్వీర్యమైంది.

గ్రామ పంచాయతీలకు అప్పగించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు

జిల్లాలో .చెత్త సంపద కేంద్రాలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద నిర్మించి గ్రామ పంచాయతీలకు నిర్వహణ బాధ్యత అప్పగించారు. అయితే ఈ ప్రభుత్వంలో చెత్త సంపద కేంద్రాలు నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో చాలా వరకు కేంద్రాలు ఆగిపోయాయి చెత్త సంపద కేంద్రాలు కాస్త ఉత్త సంపద కేంద్రాలుగా మారాయి.

శ్రీశైలంలో నేడు మహా కుంభాభిషేకం

- ఆలయ గోపురాలకు కలశ, లింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలు
- హాజరుకానున్న కంచి, పుష్పగిరి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతులు



శ్రీశైల మల్లికార్జున స్వామి ప్రధాన ఆలయ గోపురానికి ఏర్పాటు చేసిన పరంజాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 20: మహాకుంభాభిషేకం వేడుకలకు శ్రీశైలం దేవస్థానం సిద్ధమైంది. లోక కల్యాణార్థం ఈ నెల 16న చేపట్టిన మహాకుంభాభిషేకం మహోత్సవ క్రతువులు ఐదురోజుల పాటు శాస్త్రోక్తంగా జరిగాయి. చివరి రోజైన బుధవారం శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం ఉత్సవానికి ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం ఉదయం 7గంటలకు మహాకుంభాభిషేకం క్రతువులలో భాగంగా శాంతిహోమం, పౌష్టికహోమం, మహాపూర్ణాహుతి నిర్వహించి, 8.45 గంటల నుంచి పునరుద్ధరించిన ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠలు, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలు, శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, తదితర పూజాధికాలు జరపనున్నారు. అనంతరం 9.45 గంటల నుంచి ఉభయదేవాలయాల గర్భాలయ విమానాలకు, గోపురాలకు, మూలమూర్తులకు, ఇతర దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం చేయనున్నారు. ఈ మహా కుంభాభిషేకానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామీజి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి పీఠాధిపతులు హాజరుకానున్నారు.

టీమ్ వర్క్‌గా పని చేయాలి

కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు

కర్నూలు, ఫిబ్రవరి 20: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ టీమ్ వర్క్‌గా పని చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించాలని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాలు, రికవరీ, రోడ్డు ప్రమాదాలు, రాత్రి గస్తీ తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల లొకేషన్లు, సీసీ కెమెరాల గురించి ఆరా తీశారు. లైసెన్సులు ఉన్న ఆయుధాలను డిపాజిట్ చేయించాలని, రౌడీషీటర్లు ట్రబుల్ మాంగర్లపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీపీవోలను సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్, పరేడ్ మైదానాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, డీఎస్పీలు విజయశేఖర్, శివనారాయణ స్వామి, సీతారామయ్య, ట్రైనీ డీఎస్పీ భావన పాల్గొన్నారు.



డీపీవోను తనిఖీ చేస్తున్న డీఐజీ, ఎస్పీలు

మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 20: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, నంద్యాల, ఆదోని, మెడికల్ కాలేజీ, ప్రభుత్వఆసుపత్రి నర్సింగ్ కాలేజీలో నాలుగు పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ మంగళవారం విడుదల చేశారు. ఆడియో విజువల్ టెక్నీషియన్, స్టోర్ అటెండర్, ఆఫీస్ సబార్డినేట్, జనరల్ డ్యూటీ అటెండర్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.

అప్రజాస్వామిక చర్యలు

దాడులను ఖండించిన మేధావులు, రాజకీయ, ప్రజా సంఘాలు

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై జరుగుతున్న వరుస దాడులను రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. అనంతపురం సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని మరువక ముందే కర్నూలు ఈనాడు కార్యాలయంపై కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరుల దాడి, పత్తికొండలో ఆంధ్రజ్యోతి విలేకరిపై వైసీపీ నాయకుల దాడి లాంటి దుశ్చర్యలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

దాడులు అక్రమం



ఈనాడు కార్యాలయంపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం అక్రమం. ఇది సిగ్గు చేటు చర్య. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన ఆయన వర్గీయులు పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. వ్యతిరేక కథనాలు రాస్తే దాడులు చేస్తారా..? ఈ ఆటవిక చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- గౌరు చరిత, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి

తీవ్రంగా ఖండిస్తున్నాం



రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి.. కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడి చూస్తుంటే.. ఈ సమాజం ఎక్కడకు పోతుందో అనిపిస్తుంది. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం ఉందా..? రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలను జగన్ నిర్వీర్యం చేయడమే కాకుండా పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు. ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వారిని, మద్దికెర విలేకరి శేఖర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కార్యాలయాలపై దాడులు అమానుషం



మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌తో పాటు ఈనాడు కార్యాలయంపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ఇలాంటి దాడులు రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తాయి. తప్పులను ఎత్తిచూపడం పత్రికల బాధ్యత. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ ఇలాంటి దాడులకు పాల్పడుతోంది.

- రాంపుల్లయ్య యాదవ్, టీడీపీ నాయకుడు

కఠిన చర్యలు తీసుకోవాలి



ఈనాడు కార్యాలయంపైన, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలు, నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి చర్యలు మున్ముందు జరగకుండా కఠిన కేసులు నమోదు చేయాలి. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి.

- ఈఎన్ రాజు, ఏపీయూడబ్ల్యూజే, జిల్లా అధ్యక్షుడు

'సీఎం జగన్ ప్రేరేపిత దాడులు ఇవి...'



దాడి జరిగిన ఈనాడు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి, కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూకల దాడులు, మద్దికెరలో వార్తలు రాశారని ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ దాడులు చూస్తుంటే.. పక్కా ప్రణాళిక ప్రకారం దాడులు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముమ్మాటికీ సీఎం జగన్ ప్రేరేపిత దాడులు ఇవి. నగరం నడిబొడ్డులో ఉన్న ఈనాడు కార్యాలయం లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నాలు చేయడం, అద్దాలు, తలుపులు ధ్వంసం చేయడం, రాళ్లు రువ్వడం చూస్తుంటే.. సమాజం ఎక్కడకు పోతుందోనని అనుమానం కలుగుతోంది. దీనిని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాల్సి ఉంటుంది.

- ఐవీ సుబ్బారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు

సీఎం జగన్ సమాధానం చెప్పాలి



ఈనాడు కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరుల దాడిని ఖండిస్తున్నాం. మొన్న రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి, నేడు మద్దికెరలో వీరశేఖర్‌పై దాడుల వెనుక వైసీపీ కుట్ర దాగి ఉంది. పత్రికా స్వేచ్ఛను హరించేందుకు జగన్ ప్రభుత్వం పావులు కదుపుతోంది. భౌతికదాడులతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసే దుశ్చర్యలకు వైసీపీ పాల్పడుతోంది. వైసీపీ మూకల అరాచకాలపై సీఎం వైఎస్ జగన్ సమాధానం చెప్పాలి

-కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

ఇది దుర్మార్గమైన చర్య



కర్నూలులో ఈనాడు కార్యాలయంపై, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమైన చర్య. భవిష్యత్తులో ఇలాంటి అరాచకాలపై కఠిన చర్యలు ఉన్నప్పుడే ఇలాంటి దాడులు జరగవు. పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రోజురోజుకు వైసీపీ అరాచకాలు పెరిగిపోతున్నాయి.

- గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి



'దాడులు హేయం..'

కర్నూలు రాజ్‌విహార్‌లోని ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై ఎమ్మెల్యే కాటసాని అనుచరులు దాడులు చేయడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌లు తీవ్రంగా ఖండించాయి. కాటసాని అనుచరులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని కంప్యూటర్లు ధ్వంసం చేసి, తలుపులు పగులకొట్టడం, మీడియాను భయభ్రాంతులు చేసే చర్యలు నిజాలు కప్పి పుచ్చలేవన్న విషయాన్ని కాటసాని గుర్తించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, ఆంజనేయులు, బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు దాడులను ఖండించారు.

వైసీపీకి పరిపాటిగా మారింది

జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం వైసీపీకి పరిపాటిగా మారింది. ఇదంతా పక్కా ప్లాన్‌తోనే జరుగుతోంది. సీఎం జగన్ డైరెక్షన్‌లో ఆ పార్టీ నాయకులు పయనిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రతికా స్వేచ్ఛను ఖూనీ చేస్తున్న జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి.

- పీజీ నరసింహులు యాదవ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దాడి అమానుషం

ఏపీయూడబ్ల్యూజేఎఫ్

కర్నూలు, ఫిబ్రవరి 20: ఈనాడు కార్యాలయంపై కాటసాని అనుచరుల దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ నాగేంద్ర ఖండించారు. మీడియా వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప ఇలాంటి దాడులు చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడి జరిగినా, దుర్భాలాషలాడినా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసేలా సుప్రీంకోర్టు తీర్పుఇచ్చినా కూడా దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఘటనలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని తెలిపారు.

పత్తికొండలో చోరీ..

- 12 తులాల బంగారం, 50 వేల నగదు అపహరణ
- తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగ



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం

పత్తికొండ, ఫిబ్రవరి 20 : తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు 12 తులాల బంగార, రూ 50వేల నగదను దోచుకెళ్లారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పత్తికొండ పట్టణం అంబేద్కర్ సర్కిల్ సమీపంలోని పాతపెట్రోల్ బంకు వెనుక ప్రాంతంలో కురువ అనసూయమ్మ కూతురు రాశితో కలసి నివసిస్తోంది. ఆమె భర్త హనుమంతు చాల సంవత్సరాల క్రితం మరణించాడు. రాశికి మూడేళ్ల కింద ఆర్మీ జవాన్‌తో వివాహమైంది. అతను విధి నిర్వహణలో భాగంగా దేశ సరిహద్దుల్లో ఉండటంతో వివాహం తర్వాత కూడా రాశి తల్లి వద్దనే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం తల్లీ కూతుళ్ల ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు తీసి ఉన్నట్లు గమనించారు. బీరువాలో ఉంచిన బంగారు, నగదు చోరికి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ మురళీమోహన్, ఎస్ఐ వెంకటేశ్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. బీరువా తాళాలు బట్టల కిందపెట్టి ఉండడంతో దొంగలు బీరువాను తెరచి అందులో ఉన్న బంగారు, నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. సీసీ పుటేజీల ఆధారంగా సోమవారం రాత్రి ఓ యువకుడు ఇంట్లోకి వెళ్లి తిరిగి 15 నిమిషాల తర్వాత పోవడం గుర్తించారు. పూర్తిస్థాయిలో విచారణచేసి దొంగను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

ఎన్నికల విధులకు సన్నద్ధమవ్వండి

నోడల్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేటాయించిన విధుల్లో నోడల్ అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై నోడల్ అధికారులు, ఆర్వోలతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ఇంకా సమయం ఉందనే అలసత్వం వహించకుండా కేటాయించిన విధుల నిర్వహణకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. మెటీరియల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రికార్డులు నిర్వహించాలని సూచించారు. గురువారం సెక్టార్ అధికారులకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. హోం ఓటింగ్ నిర్వహణకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ పేపర్లు, ఈటీపీబీఎస్‌కు సంబంధించి ప్రతి నియోజకవర్గంలోని 8 డిస్పాచ్ సెంటర్లలో 8 ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆర్వోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగాయి. ఒకేషనల్ కోర్సు ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు, జనరల్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు 11 నుంచి 20వ తేదీ వరకు జరిగాయి. ఒకేషనల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 3509 మంది విద్యార్థులు హాజరయ్యారు. 25 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 1981 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1525 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే జనరల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలకు మొత్తం 14,534 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఎంపీసీ విద్యార్థులు 9750 మంది, బైపీసీ గ్రూపు విద్యార్థులు 4784 మంది ఉన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్ఐవో, జిల్లా కన్వీనర్ ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో డీవీఈవో జమీర్ పాషా, డీఈసీ కమిటీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, జి.లాలెప్ప, ప్రభు, స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

న్యూరో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం



కర్నూలు జీజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 20: రాష్ట్రంలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిసారిగా న్యూరో స్ట్రోక్ యూనిట్ (పక్షవాతం)ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డా.జి. సృజన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాకు 2వ ఫ్లోర్‌లో న్యూరో ఇంటెన్సివ్ కేర్ స్ట్రోక్ యూనిట్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, న్యూరాలజీ హెచ్‌వోడీ డా.సి. శ్రీనివాసులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ బీపీ ఎక్కువ కావడం వల్ల మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి కణితులు రావడం, మెటబాలిన్ సమస్యలు మొదలైనవాటితో చాలా మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 12 పడకలతో న్యూరో ఇంటెన్సివ్ కేర్ స్ట్రోక్ యూనిట్‌ను ప్రారంభించామన్నారు.ఈ యూనిట్‌లో శిక్షణ పొందిన నర్సులు అనస్థీషియా సిబ్బంది, న్యూరాలజిస్టులు, వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాష్ట్రంలోనే ఈ యూనిట్ మొట్టమొదటిదని, దీని వల్ల అక్యూట్ మెడికల్ కేర్ (కేఎంసీ) విభాగంపై భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. సుధాకర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, మెడిసిన్ హెచ్‌వోడీ డా.రాజశేఖర్, ప్రొఫెసర్లు లక్ష్మి, విద్యాసాగర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎగబాకిన పత్తి ధర



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 20: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు పెరుగుతున్నాయి. ఐదు రోజులుగా పత్తి ధరలు ఆశించిన స్థాయిలో పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం గరిష్ఠంగా పత్తి ధర క్వింటం రూ.7,419 పలికింది. ఇప్పటికే చిన్న, సన్నకారు రైతులు పత్తి ధరల కోసం వేచి చూసి ధరలు పెరగకపోవడంతో 90 శాతం మంది విక్రయించుకున్నారు. పత్తి విక్రయాలు పేలవంగా సాగుతున్నాయి. పరిశ్రమల్లో ఉత్పత్తికి అవసరమైన పత్తి లేకపోవడంతో డిమాండ్ పెరిగింది. దీంతో పత్తికి డిమాండ్ పెరిగి ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లోనూ దూది ధరలు స్వల్పంగా పెరిగాయని తెలిపారు. వారం రోజుల్లో పోల్చితే పత్తి ధర క్వింటాకు రూ.400 పైగా పెరిగింది. పత్తి విక్రయించుకున్నాక ధరలు పెరగడంపై రైతులు నిరాశ చెందుతున్నారు. 1,082 క్వింటా పత్తి మార్కెట్ యార్డుకు విక్రయానికి రాగా, క్వింటం గరిష్ఠంగా రూ.7,419, కనిష్ఠంగా రూ.4,687, మధ్యస్థ ధర రూ..6,969 పలికింది.

పేదల సాగు భూముల్లో ఇంటి స్థలాలా?

- రాజకీయకక్షతోనే పట్టాల పంపిణీ
- ఇంకే ఖాళీ స్థలం కనపడలేదా?
- రైతులపై రాజకీయ కక్ష సాధింపు
- అండగా ఉంటామన్న గౌరు చరిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



పాలకొలనులో పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 20: పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూముల్లో రాజకీయ కక్షతోనే ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చారని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత రెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలకొలను గ్రామంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములను గౌరు చరిత, రాజశేఖర్‌తో పాటు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల టీడీపీ ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డితో పాటు బాధిత రైతులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరు చరిత మాట్లాడుతూ 151 సర్వే నెంబరులో 60 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూముల్లో ఆరుగురు రైతులు 11 ఎకరాలు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి సాగు భూమిగా తయారు చేసుకుని నిమ్మ, పొగాకు మిరప తదితర పంటలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఏడు సంవత్సరాలుగా పాస్ పుస్తకాల కోసం అధికారులు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌తో కూడా మాట్లాడామన్నారు. అవసరమైతే బాధితుల తరఫున కోర్టుకు వెళ్లేం దుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, మహబూబ్‌బాషా, చదువుల సుధాకర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 20: సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో గత పదిరోజులుగా కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం స్వామి అమ్మవార్ల చక్రస్నానంతో ముగిశాయి. ఇందులో భాగంగా వేకువ జామున స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య తుంగభద్ర నదికి తీసుకువెళ్లి చక్రస్నానం కార్యక్ర మాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాజ్యసభ మాజీ సభ్యు డు టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. స్వామివారి చక్రస్నానం సమయంలో ఆకాశంలో గరుడ పక్షి విహరించడంతో భక్తులు ఆనందభరితులయ్యారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఏటా బ్రహ్మోత్సవాలు ప్రారంభ సమయంలో, చక్రస్నానం వేడుకలో ఆకాశంలో గరుడ పక్షి ప్రదక్షిణ చేయ డం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సం ఘం అధ్యక్ష, కార్యదర్శులు కళ్లే చంద్రశేఖర శర్మ, హెచ్‌కే రాజశేఖర్, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, సభ్యులు కేజీ ప్రభాకర్‌రావు, శివరామ ప్రసాద్, బాలసత్యనారాయణ, కేవీ సుబ్బారావు, సుదర్శన్, సూర్యనారాయణ, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులతో తరలివెళ్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

క్యాజువాల్టీలో రోగుల నరకయాతన

- గంటల్లోనే అడ్మిషన్ అంటున్న సూపరింటెండెంట్
- నాలుగు గంటలైనా అడ్మిషన్ చేయించుకోని వైద్యులు



ఎక్స్‌రే ఫిల్మ్ కోసం వేచి చూస్తున్న అనంతపురం జిల్లా వాసి చందానాయక్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 20: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అత్యవసర రోగులు క్యాజువాల్టీలో నరకయాతన అనుభవిస్తున్నారు. ఓ పక్క ఆసుపత్రి సూపరింటెండెంట్ క్యాజువాల్టీకి వచ్చిన రోగులు గంటలోపు అడ్మిషన్ చేయించుకుని వార్డుకు షిఫ్టు చేయాలన్న ఆదేశాలు బేఖాతరు అవుతున్నాయి. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కదిలిపల్లెకు చెందిన 65 ఏళ్ల చందా నాయక్ కడుపులో గడ్డ ఉంటే అనంతపురం జీజీ హెచ్ వైద్యులు రెఫర్ చేస్తే మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. క్యాజువాల్టీ ఓపీ తీసుకుని వైద్యుల దగ్గరకు వెళ్లారు. వైద్యులు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ రాసి ఇచ్చారు. ఈ పరీక్షలు చేయించుకుంటే తాము అడ్మిషన్ చేయించుకుంటామని చెప్పారు. దీంతో రోగి చందా నాయక్ తన కుమారున్ని వెంట తీసుకుని స్ట్రెచ్చర్ కోసం ప్రయత్నించారు. డబ్బులు అడగడంతో ఎక్స్‌రే నడుచుకుంటూ వెళ్లి పరీక్ష చేయించుకున్నారు. తర్వాత అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు వెళ్లగా రేడియాలజి వైద్యులు ఎక్స్‌రే ఫిల్మ్ గానీ లేదా ఫొటో తీసుకుని రావాలని చెప్పారు. ఈ విషయాన్ని వైద్యులకు (హౌస్‌సర్జన్లు) చెప్పగా వస్తాంలే అని దాట వేశారు. సాయంత్రం 5 గంటలవుతుండటంతో ఓ వ్యక్తి వచ్చి ఎక్స్‌రే వార్డు దగ్గరకు రోగికి తీసుకెళ్లారు. అక్కడ ఎక్స్‌రే సిబ్బంది స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని, దానిలో ఫిల్మ్ ఫొటో ఇస్తామన్నారు. తమ దగ్గర స్మార్ట్ ఫోన్ లేదని చిన్న ఫోన్ ఉందని చెప్పడంతో వెనుదిరిగారు. మరో వ్యక్తి వచ్చి స్మార్ట్ ఫోన్‌లో ఎక్స్‌రే ఫొటోను తీసుకుని రోగిని రేడియాలజి విభాగానికి తీసుకెళ్లి సాయంత్రం 7 గంటలకు స్కానింగ్ చేయిం చారు. మధ్యాహ్నం 3 గంటలకు వచ్చిన రోగికి స్కానింగ్, ఎక్స్‌రే పరీక్షకు 4 గంటలు సమయం పట్టడం, ఇక రోగి అడ్మిషన్ కాకుండా క్యాజువాల్టీలో ఉండటం అక్కడ పరిస్థితిని అద్దం పడుతుంది.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పాములపాడు, ఫిబ్రవరి 20: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. మండలంలోని వేంపెంట గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసరాజ్యం రాజ్యమేలుతోందని, వైసీపీని గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ హయాంలో ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవించలేని దుస్థితి నెలకొందన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, బండ్లమూరి చంద్రశేఖర్, గోవిందు, రమేశ్‌రెడ్డి, పటుచాని మహేశ్వరరెడ్డి మల్లికార్జున నాయుడు, చిన్న వెంకటసుబ్బయ్య, యువరాజ్, సుందర్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'



సమావేశంలో ప్రసంగిస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 20: వైసీపీ అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు సూచించారు. నంద్యాలలో మంగళవారం బీజేపీ ఎన్నికల కార్యాలయంల నిర్వహిస్తున్న ప్రజా పోరు యాత్ర రూట్ మ్యాప్‌పై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అభిరుచి మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత నిధులను వాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నట్లు వైసీపీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. కేంద్రం నిధులు ఇస్తేగాని ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. వైసీపీ నాయకులే శిల్పా కుటుంబం అరాచకాలు బయట పెడుతున్నారన్నారు. రామకృష్ణారెడ్డి, స్వాతి, లింగన్న, కశెట్టి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మధు గోపాల్, గరు బ్రహ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల కడుపులు కొట్టొద్దు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 20: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పని చేసే కాంట్రాక్టు కార్మికుల కడుపులు కొట్టొద్దని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కార్యదర్శి మహమ్మద్ గౌస్, కాంట్రాక్టు వర్కర్ల సంఘం అధ్యక్షుడు పుల్లయ్య అన్నారు. మంగళవారం నాలుగో రోజు సమ్మెలో భాగంగా ఆర్ఏఆర్ఎస్ ప్రధాన గేటు ముందు కాంట్రాక్టు కార్మికులు బైఠాయించి ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను మరోసారి మభ్యపెట్టాలని చూస్తున్న జగన్ ప్రభుత్వానికి పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. గతంలో హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చరిత్ర జగన్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన తరహాలోనే కాంట్రాక్టు కార్మికులకు కూడా వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగేశ్వరమ్మ, అయ్యన్న, రమణయ్య, దివాకర్, వెంకట లింగం, నాగరాజు, భారీ సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

'సీహెచ్‌డబ్ల్యూవోలను ఆశా వర్కర్లుగా గుర్తించాలి'



మాట్లాడుతున్న ఏసురత్నం

ఆత్మకూరు, ఫిబ్రవరి 20: గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్న వారిని ఆశావర్కర్లుగా గుర్తించి రూ.10వేల వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం, సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, శారద, లక్ష్మీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ అనేక సంవత్స రాలుగా ఆశావర్కర్లుగా చేస్తున్న విధులనే సీహెచ్‌డబ్ల్యూవోలు నిర్వహిస్తున్నారని అన్నారు. అయితే వారికి అతితక్కువ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. పనికి తగిన వేతనం ఇవ్వడంతో పాటు వారి పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ కిట్లు, సెల్‌ఫోన్లు ఇవ్వాలని కోరారు. శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంటనే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో ఏవో మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 20: నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏవో డాక్టర్ చంద్రశేఖర్ మృతిచెందారు. కొద్దిరోజుల క్రితం ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు.

నంద్యాల (నూనెపల్లె): నంద్యాలలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ అకాల మరణం ఎంతగానో బాధించిందని ఏపీ ఎన్జీవో నంద్యాల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మణిశేఖర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పీఎం కిసాన్‌పై ప్రత్యేక సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి

పాణ్యం, ఫిబ్రవరి 20: ప్రధానమంత్రి కిసాన్‌పై ప్రత్యేక సమీక్ష నిర్వహించినట్లు డీఏవో మోహన్‌రావు తెలిపారు. మంగళవారం పాణ్యం వ్యవసాయ కార్యాలయంలో ఎంఏవో జయప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడీఏ రాజశేఖర్ పాల్గొన్నారు. డీఏవో మాట్లాడుతూ పీఎం కిసాన్ మంజూరులో భాగంగా రైతుల ఈకేవైసీ, ఆధార్ లింకేజ్, ఎన్‌పీసీఐ అనుసంధానం పనుల రెండురోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ సమస్యలపై ఎప్పటికప్పుడు సిబ్బంది రైతులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

● టీడీపీ నాయకుల మండిపాటు



కొత్తపల్లిలో మాట్లాడుతున్న కాకరవాడ చిన్న వెంకటస్వామి



మహానందిలో రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు, జర్నలిస్టులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడి చేయడం అమానుషమని నందికొట్కూరు టీడీపీ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి మండిపడ్డారు. మంగళవారం కొత్తపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ దాడిపై కొందరు విలేకరులు ఎమ్మెల్యే కొడాలి నాని వద్ద ప్రస్తావించారని, అయితే ఆ దాడిని సమసర్థిస్తూ మాట్లాడడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు కర్నాటి శివారెడ్డి, మధుసూదన్ రెడ్డి, చిన్నపుల్లారెడ్డి, నాగ శేషన్న, శంకర్ రావు, ముజుబూర్ రెహిమాన్, మాణిక్య రాజు, అశోక్, సుబ్బరాయుడు, ఆనంద్, మోహన్ రెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: పాత్రికేయులపై వైసీపీ గూండాలతో దాడి చేయించడమే గాక రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి హెచ్చరించారు. మంగళవారం మండలంలని ఎర్రగూడూరు గ్రామంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ఫోర్త్ ఎస్టేటుగా మీడియా వ్యవహరిస్తోందని, చదువుకున్న వారికి వాటి విలువ తెలుస్తుందని అన్నారు. రౌడీలకు ఆ విలువ ఎలా తెలుస్తుందని మండిపడ్డారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాలు విసిరారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అమానుషమని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రెండురోజులు గడిచినా దాడికి పాల్పడ్డ వారిని ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉస్సేం రాముచౌదరి, పుల్లారెడ్డి, శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, మాణిక్యరాజ్, ముజుబూరు, భరత్, గోవిందరాజులు, పాములపాడు, కొత్తపల్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానంది: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడి చెయ్యడం హేయమైన చర్య అని టీడీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం మహానంది ప్రధాన కూడలిలోని నంద్యాల- మహానంది రహదారిలో మండల పాత్రికేయులు, టీడీపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. రామలింగారెడ్డి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైసీపీ గూండాలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పాత్రికేయులు బండారు బాలకృష్ణ, వెంకటశివుడు, నరసింహులు, షేక్షావలి, గంగిశెట్టి జనార్దన్‌రావు, రఫీ, ఏపీడబ్ల్యూజేఎఫ్ నంద్యాల జిల్లా కో కన్వీనర్ కాకర్ల శివ మండల రెవిన్యూ కార్యాలయం చేరుకొని తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. మహానంది ఆలయ మాజీ ఛైర్మన్ పాణ్యం ప్రసాదరావు, గాజులపల్లి ఆర్ఎస్ సర్పంచ్ అస్లాంబాషా, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి క్రాంతికుమార్ యాదవ్, టీడీపీ నాయకులు మౌళీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగపుల్లయ్య, మారెడ్డి సుబ్రమాణ్యం, సూరే శ్రీనివాసులు, రామచంద్రుడు, మునగనూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృత తనిఖీలు



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 20: జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో సివిల్ పోలీసులు, సెబ్ అధికారులు విస్తృత తనిఖీ చేపట్టారు. ఇసుక, గంజాయి, నాటుసారా, నగదు, మద్యం అక్రమ తరలింపులను అడ్డుకునేందుకే దాడులు చేస్తున్నట్లు ఆయా విభాగాల అధికారులు తెలిపారు. మంగళవారం నాటి దాడుల్లో డీపీఎల్ 7కేసులు నమోదు చేసి 145 (90ఎంఎల్)మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే అక్రమంగా తరలిస్తున్న 480 కర్ణాటక మద్యం బాటిళ్లను సీజ్ చేశామన్నారు. 8మందిని ముందస్తు చర్యల్లో భాగంగా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ దగ్గర బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో 5 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంతోపాటు 5ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. నాటుసారా, మద్యానికి సంబంధించి 5కేసులు నమోదుచేసి 71లీటర్ల నాటుసారాను సీజ్ చేశామని తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించని 62మందినుంచి రూ.23,580 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా అక్రమ మద్యం, గంజాయి, నగదు, నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలుమార్లు కేసుల్లో ఉన్నవారి ప్రవర్తనలో మార్పురాకపోతే పీడీ ఆక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

'విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి'

పాణ్యం, ఫిబ్రవరి 20: విద్యుత్ శాఖ ఏఈ పుల్లయ్య సిబ్బందిని వేధిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ 1104 యూనియన్ నాయకులు మహేశ్వరరెడ్డి, మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. మంగళవారం పాణ్యంలోని కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యుత్ ఏఈ అక్రమాలను బయటపెడుతున్నామన్న కక్షతో వేధిస్తున్నారని అన్నారు. ఏఈపై డీఈ, ఏడీలకు ఫిర్యాదు చేసినా విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే ఏడీ, ఈఈ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృపవరం, డేనియల్, సిబ్బంది పాల్గొన్నారు.

24న జంబులా పరమేశ్వరి బోనాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 20: ఆత్మకూరు పట్టణ శివార్లలోని జంబులా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఈనెల 24న శనివారం మాఘశుద్ధ పౌర్ణమి (భారతాల పౌర్ణమి) వేడుకను పురస్కరించుకుని బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. లోకకళ్యాణార్థం ప్రతిఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారికి మహిళలతో బోనాలను ఆనవాయితీగా సమర్పిస్తారు. ఈ వేడుకలో భాగంగానే అమ్మవారికి విశేష అలంకరణ గావించి వేదపండితుల ఆధ్వర్యంలో యాగక్రతువులను అభిషేకాలు, కుంకుమార్చనలు వంటి పూజా క్రతువులను శాస్త్రోక్తంగా జరపనున్నారు. అలాగే ఉత్సవానికి విచ్చేసిన భక్తులందరికి అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

వెలుగోడు, ఫిబ్రవరి 20: వెలుగోడు పట్టణంలో పొదుపు మహిళలకు వైయస్సార్ నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నిర్వహించారు: మంగళవారం అబ్దుల్లాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం, నూతనంగా నిర్మించిన పాల కేంద్రాన్ని, వెలుగోడులో రైతుబజారు, సహకార సంఘం నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాలలో ఎంపీపీ లాలం రమేశ్, కేడీసీసీ ఛైర్ పర్సన్ విజయ మనోహరి, సర్పంచ్ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి మాండ్ర పరామర్శ



ఎర్రగూడూరులో నాయకుడిని పరామర్శిస్తున్న శివానందరెడ్డి

పాములపాడు, ఫిబ్రవరి 20: అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు హనుమంతు నాయక్‌ను మంగళవారం ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు మాండ్ర శివానందరెడ్డి పరామర్శించారు. ఎర్రగూడూరులో కలిసి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, చంద్రశేఖర్, గోవిందు తదితరులు ఉన్నారు.

'తెలుగు రైతు అధ్యక్షుడిపై హత్యాయత్నం హేయం'

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 20: తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం హేయమని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుపల్లి హరిబాబు ఒక ప్రకటనలో మంగళవారం అన్నారు. కత్తితో విచక్షణారహితంగా పొడిచి దుండగులు పారిపోయారని, వారిని పోలీసులు వెంటనే పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డికి అవసరమైన అన్ని అత్యవసర వైద్య సేవలను అందించాలని హరిబాబు కోరారు.

రేపటి నుంచి భీష్మ ఏకాదశి హోమాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 20: మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రంలో ఈ నెల 22, 23 తేదీల్లో 65వ భీష్మ ఏకాదశి కార్యక్రమ పూజలు, హోమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కాకనూరు శారదా మఠం పీఠాధిపతులు శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీ తెలిపారు. మంగళవారం స్వామీజీకొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రెండు రోజుల పాటు కొలను భారతి క్షేత్రంలో నిర్వహించే భీష్మ ఏకాదశి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ 22న గురువారం ఉదయం కాకనూరు నుంచి తమ శిష్య బృందంతో బయలుదేరి సాయంత్రం ప్రదోషకాలంలో 6 నుంచి 7 గంటల వరకు మంగళ వాయిద్యాలతో అమ్మవారి మేలుకొలుపు కొలువు అనంతరం వేద పారాయణం ఉంటుందని చెప్పారు. 7.30 గంటలకు అన్నదానం, 8 నుంచి 10 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలచేత భక్తి ప్రవచనాల కార్యక్రమం ఉంటాయన్నారు. అలాగే రాత్రి 10 గంటలకు అఖండ భజన, చెక్క భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే 23న శుక్రవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి మంగళవాయిద్యాలచే మేలుకొలుపు, 5.30 గంటలకు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, 7.30 గంటల నుంచి క్షేత్ర ప్రాంగణంలో శ్రీలక్ష్మి గణపతి హోమం, చండీ హోమం, మహాసరస్వతి హోమాలు, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని స్వామీజీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

నంద్యాల (కల్చరల్): నంద్యాలలో పలు ఆలయాలలో మంగళవారం భీష్మ ఏకాదశి పురష్కరించుకొని భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఉమామహేశ్వర ఆశ్రమంలో ఉదయం భగవద్గీత పారాయణం, సంజీవనగర్ రామాలయంలో నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. వేంకటేశ్వరునికి అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

గడివేముల, ఫిబ్రవరి 20: మండలంలోని కొరటమద్ది గ్రామానికి చెందిన కృష్ణామాచారిపై రాఘవశేషారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. రాఘవ శేషారెడ్డి తన ఇంటి నుంచి కలం వద్దకు వెళ్తుండగా కృష్ణామాచారి అడ్డుకొని బెదిరించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'



నంద్యాలలో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు



పాణ్యంలో నిరసన

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 20: నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం కార్మిక శాఖ అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాసులు, సుశీలమ్మ, తులశమ్మ, సులోచనమ్మ మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు నెలల తరబడి జీతం ఇవ్వకపోతే వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. అలాగే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలుకావడం లేదన్నారు. నిబంధనల ప్రకారం సెలవులు కూడా మంజూరు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడి త్వరలో జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణమ్మ, గుండు లక్ష్మి, గోవిందపల్లిరాణి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: పారిశుధ్య కార్మికులను ప్రభుత్వాలు నీచంగా చూస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం అన్నారు. పాణ్యం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పారిశుధ్య కార్మికుల వేతనాలు అమలు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. పారిశుధ్య కార్మికులను ప్రభుత్వాలు తమ న్యాయమైన కోర్కెలు తీర్చకుండా నీచంగా చూస్తున్నాయన్నారు. తక్కువ వేతనాలు అమలు చేస్తూ సౌకర్యాలు కల్పించకుండా వేధిస్తున్నారన్నారు. వేతనాలు పెంచకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారన్నారు. టెండర్ విధానం రద్దు చేసి 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించినా గుర్తింపులేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత, బామా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భాస్కర్ ప్రతాప్, కార్మికులు శ్రీరాములు, దినేష్, ప్రవీణ్, లక్ష్మీదేవి, సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీశైలంలో వైసీపీకి షాక్

● టీడీపీలోకి చేరిన 300 పైగా కుటుంబాలు



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బుడ్డా

శ్రీశైలం, ఫిబ్రవరి 20: శ్రీశైలం గ్రామంలో వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఘంటామంఠం, ఎస్సీ ఎస్టీ కాలనీ ప్రాంతానికి చెందిన దాదాపు 300కు పైగా కుటుంబాలు చేరాయి. వైసీపీ నాయకులకు కండువా వేసి బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీలోకి ఆహ్వానించారు. బుడ్డా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. బాబు అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనకపడిందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని, రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ దుర్మార్గ పాలనతో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణమస్తు నగదు జమ : కలెక్టర్



చెక్కును అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 20: జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద 5వ విడతలో అర్హులైన 479 మంది లబ్ధిదారులకు రూ.4.06,35,000 జమ చేశామని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకానికి నిధులు జమ చేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే ఆర్థర్, రాష్ట్ర మైనారిటీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ఎస్డీసీఎల్ డైరక్టర్ శశికళరెడ్డి, రాష్ట్ర హస్తకళ డైరెక్టర్ సునీల్ అమృత రాజ్, బెస్త సంక్షేమ సంఘం డైరక్టర్ చంద్రశేఖర్, తదితరులు వీక్షించారు. లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

కష్టపడితే సత్ఫలితాలు: వీసీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 20: జీవితంలో కష్టపడే వ్యక్తిత్వంతో పని చేసే ప్రతి ఒక్కరూ సత్ఫలితాలు సాధిస్తారని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్, పీజీ కళాశాలలో అదనపు కంప్యూటర్ ల్యాబ్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామకృష్ణా విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాలలో వసతులను, ల్యాబ్‌లను, ఇండోర్ స్టేడియాన్ని, తదితర వాటిని వీసీ పరిశీలించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ విద్య విద్యార్థులకు ప్రస్తుత తరుణంలో ఎంతో అవసరం ఉండటంతో కళాశాలలో 700 కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలలోని కామర్స్ విభాగం అధ్యాపకుడు పుల్లయ్య రచించిన కస్టమర్స్ శాటిస్‌ఫ్యాక్షన్ ఫర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల కార్యదర్శి విజయ్‌కుమారి, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, మేనేజర్ ప్రగతిరెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీసీ మీడియాతో మాట్లాడారు. రాయలసీమ విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించండి: డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

నందికొట్కూరు, ఫిబ్రవరి 20: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక, బాలుర పాఠశాలలను డీఈవో సుధాకర్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖిగా చర్చించి వారికి పదో తరగతి పరీక్షలపై పలు ముఖ్యమైన సూచనలు, సలహాలు ఇచ్చారు.

'ఇంటి పట్టాలు ఇవ్వాలి'



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, ఫిబ్రవరి 20: బీఆర్ఆర్ నగర్ గుడిసె వాసులకు ఇంటి పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, సీపీఎం సీనియర్ నాయకులు రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు మున్సిపాలిటీ కర్నూలు రోడ్డు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2009 నుంచి 300 మంది పేదలు సర్వే నెంబర్ 589,590, 595లలో ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ కులాలకు చెందిన పేదలు గడిసెలు వేసుకొని నివాసం ఉన్నారన్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు, మంచినీటి సదుపాయం, రోడ్ల సౌకర్యం కల్పించాలని వారు డిమాడ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రజాసంఘాల నాయకులు పక్కీర్ సాహెబ్, కర్ణ, నాగన్న, బాలయ్య, హుస్సేనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'

గడివేముల, ఫిబ్రవరి 20: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వలంటీర్లను ఆదేశించారు. ఉత్తమ సేవలు అందించిన 189 మందికి సేవమిత్ర, 5 మందికి సేవారత్న, ఇద్దరికి సేవ వజ్ర, పురష్కారాలను మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామిరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈవోఆర్డీ అబ్దుల్ కాలిక్, మండల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం తప్పదు: మాజీ మంత్రి


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిలప్రియ

నంద్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని, దీంతో సీఎం జగన్ రాష్ట్రం విడిచి పోతారని అన్నారు. సీఎం జగన్‌కు ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఘోరాలు, నేరాలు, అక్రమాలు, కబ్జాలు, అవినీతి పాలన కొనసాగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో చింతకుంట శ్రీనివాసరెడ్డి (వాసు), డాక్టర్ రామ గోపాల్‌రెడ్డి, లాయరు శివరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, కౌన్సిలర్ హుసేన్‌బాషా, టీడీపీ మహిళా కార్యకర్తలు నూర్జహన్, రమిజా, సుబహాని, అట్ల శ్రీదేవి, పూజిత, భాస్కర్, శివ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఎం శ్రీనివాసులు

డోన్, ఫిబ్రవరి 20: ఓటరు జాబితా వెరిఫికేషన్‌పై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. సీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మరింత అప్రమత్తంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటరు జాబితాలో అవకతవకలు జరిగినట్లు సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారిపేర్లు ఉంటే వాటిని గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, పట్టణ పార్టీ కార్యదర్శి ఎస్ఎండీ రఫీ బీసీ సెల్ నాయకులు ధను, ఎర్రిస్వామి గౌడు పాల్గొన్నారు.

బనగానపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా నాగరాజు

బనగానపల్లె, ఫిబ్రవరి 20: బనగానపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా నాగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న శివరామయ్య యధావిధిగా బనగానపల్లె ఈవోఆర్డీగా విధుల్లో కొనసాగనున్నారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో నాగరాజు మాట్లా డుతూ గ్రామ సచివాలయాల్లో సిబ్బంది, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థి ఎంపిక

బనగానపల్లె, ఫిబ్రవరి 20: పట్టణంలోని ఎస్వీ చైతన్య పాఠశాలకు చెందిన షంషీర్ బాషా అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికై నట్లు కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, చైర్మన్ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో జిల్లాలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శ నలో బనగానపల్లె విద్యార్థి షంషీర్ బాషా సోలార్ వాటర్‌హీటర్ అనే ప్రాజెక్టును ప్రదర్శించి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థితోపాటు గైడ్ టీచర్ సుబ్బారెడ్డిని కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, చైర్మన్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివశంకర్

చాగలమర్రి, ఫిబ్రవరి 20: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర ఎన్నికల్లో చాగలమర్రికి చెందిన ఎస్టీయూ నాయకుడు శివశంకర్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళవారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిల కోసం పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్ర కౌన్సిలర్లు, ఎస్టీయూ నాయకులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

దొర్నిపాడు, ఫిబ్రవరి 20: ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షురాలు చిటికెల సలోమి అన్నారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కేసులపై పోలీసు, రెవెన్యూ శాఖలు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సంజామల, ఫిబ్రవరి 20: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తహసీల్దారు జ్యోతి రత్నకుమారి మంగళవారం ఉదయం అక్కంపల్లె, నొస్సం, గిద్దలూరు, ముక్కమళ్ల, ఆల్వకొండ, సంజామల, మంగపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ఐ వెంగళరెడ్డిని ఆదేశించారు. ఆమె వెంట ఏఎస్‌వో మద్దిలేటి, మాలిక్‌బాషా, గోపాల్, వీఆర్‌వోలు ఎరుకలయ్య, సుబ్బరాయుడు, గురప్ప, నరేశ్, మనోహర్, ఉన్నారు.

రుద్రవరం: మండలంలోని రుద్రవరం, రెడ్డిపల్లె, తువ్వపల్లె, నాగులవరం పోలింగ్ కేంద్రాలను శిరివెళ్ల సీఐ చంద్రబాబు పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా పనిచేయాలన్నారు. పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొని శాంతిభద్రతలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు జరపాలని సూచించారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ఏఎస్ఐలు శోభన్‌బాబు, బాలన్న ఉన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్యాపిలి, ఫిబ్రవరి 20: ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడు అన్నారు. మంగళవారం పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

శిరివెళ్ల, ఫిబ్రవరి 20: శిరివెళ్లలో పునఃప్రతిష్ఠించనున్న బసవేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గోపూజనం, రక్షాబంధనం, యాగశాల సంస్కారం, ప్రాక్షోకరణ, దిక్పాల పూజలు నిర్వహించారు. సంకీర్తన మహా యజ్ఞంలో భాగంగా నంద్యాల ఆయుష్ యోగా సేవా సమితి నిర్వాహకులు ఖండె ఆనంద్ గురూజీ శిష్య బృందంచే కోలాటం నిర్వహించారు.

‘ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం’


రుద్రవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

రుద్రవరం, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జగన్ నిర్వహించిన సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేయడం అమానుషమని, దాడి చేసిన వారిని శిక్షించాలని రుద్రవరం మండలం పాత్రికేయులు బాషా, నాగయ్య, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రుద్రవరం తహసీల్దారు మురళీమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఆళ్లగడ్డ తాలుకా సీపీఐ కార్యద ర్శి భాస్కర్ మాట్లాడుతూ అక్షరంపై దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని అంధకారంలోకి తీసుకుపోవడమేనని అన్నారు. ఏకంగా సీఎం సభలోని ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ ప్రభుత్వం దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాలమహా మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న పాత్రికేయులపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు .ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శంకర్, జాన్, మోహన్, నరసింహ, ఇమ్మానుయేల్, ఇమాంసా, షాషా, అంజి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం వైసీపీ ప్రభుత్వ దౌర్జన్యాలకు నిదర్శనమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛకు వైసీపీ భంగం కలిగిస్తోందని విమర్శించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చాగలమర్రి: అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం బహిరంగ సభలో వైసీపీ మూకలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అమానుషమని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ జిల్లా కన్వీనర్ సల్లా నాగరాజు, మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా తీవ్రంగా ఖండించారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు వద్ద నిరసన ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మీడియాకు స్వేచ్ఛ లేకపోవడం బాధాకరం అన్నారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు వీరయ్య, మస్తాన్, పెద్దబాషా, బాబు, బాలదస్తగిరి, అలీ, రంగప్ప, పిచ్చన్న, బ్రహ్మయ్య, అబ్దుల్‌ఖాదర్, మధు, బాషా, ఖాజా పాల్గొన్నారు.


చాగలమర్రిలో నిరసన తెలుపుతున్న నాయకులు

20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యం

టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి


టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 20: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే చంద్రబాబు లక్ష్యమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోసపు హామీలతో నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వస్తే.. నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, అభిరెడ్డిపల్లె గోవిందు, ఎల్ఐసీ శ్రీరాములు, మధుసూదన్ రెడ్డి, కొచ్చెర్వు రామాంజనేయులు, గుల్షన్, కాశీ విశ్వనాథ్, చింతలపేట వెంకట్రాముడు, బబ్లూ యాదవ్ పాల్గొన్నారు.

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకుడు నాగూర్‌వలి, అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని 227 బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడులు చేయడం అమానుషమని అన్నారు. టీడీపీ నాయకులు పెద్ద మహమ్మద్, ఉసేన్‌బాషా, సుబ్బరాయుడు, వాసు, మహిళలు పాల్గొన్నారు.

‘వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత’


టీడీపీలో చేరిన వారితో భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 20: వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామ్‌నాయుడు అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా మంగళవారం హరివరం గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన గండా వెంకటరామసుబ్బారెడ్డి, పల్లె వెంకటశివారెడ్డి, ఏవీ నారాయణరెడ్డి, మద్దూరి సత్యరాజ్, పుల్లయ్య, సుంకన్న, కాకర్ల నరేష్, నరేష్‌తో పాటు మరో 20 మంది వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ మహిళలు, యువతను వైసీపీ విస్మరించిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డిశేఖర్రెడ్డి, మండల కన్వీనరు కుడాల నారాయణరెడ్డి, మండల నాయకులు పేరెడ్డి మోహన్‌రెడ్డి, మద్దూరు కృష్ణారెడ్డి, పల్లె బాబుల్‌రెడ్డి, కర్నాటి మహేశ్వర్‌రెడ్డి, నరసింహుడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

‘విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలి’

చాగలమర్రి, ఫిబ్రవరి 20: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. మంగళవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతర బోధన చేయాలన్నారు. పిల్లల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికి తీయాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో అయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వేలంలో రూ.5లక్షల ఆదాయం


వేలంలో పాల్గొన్న పాటదారులు

బనగానపల్లె, ఫిబ్రవరి 20: మండలంలోని యాగంటి క్షేత్రంలో మంగళ వారం నిర్వహించిన వేలం పాటల్లో ఆలయానికి రూ.5లక్షల ఆదాయం లభించినట్లు ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోటబుచ్చిరెడ్డి తెలిపారు. దేవదాయశాఖ పర్యవేక్షకుడు నాగప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేలం పాట ల్లో మురుగదొడ్ల నిర్వహణ హక్కు లైసెన్సుకు జరిగిన వేలం పాటలో ఈ ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. ఏడాది పాటు మరుగుదొడ్లు నిర్వహణ హక్కు కోసం వేలం పాటలు నిర్వహించగా యాగంటిపల్లెకు చెందిన రామనాథరెడ్డి అనే వ్యక్తి వేలం పాట దక్కించుకున్నట్లు వారు తెలిపారు.

నీడనిచ్చే చెట్టును నరికేశారు..


డోన్ పాతబస్టాండులో నరికివేసిన రాగి చెట్టు

డోన్, ఫిబ్రవరి 20: డోన్ నడిబొడ్డున నీడను ఇచ్చే చెట్టును నరికేశారు. మున్సిపల్ అధికారుల నిర్వాకంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పాతబస్టాండులో రాగిచెట్టు ఉండేది. 70 ఏళ్లకు పైగా ఈ చెట్టు ప్రజలకు నీడనిస్తోంది. ఈ చెట్టు రోడ్డుకు అడ్డంగా ఉందని.. సోమవారం రాత్రికిరాత్రే చెట్టును నరికివేశారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలతోనే మున్సిపల్ అధికారులు చెట్టును కూల్చివేసినట్లు ఆరోపణలున్నాయి.

చెట్లను తొలగించడం దారుణం: కాంగ్రెస్

డోన్(రూరల్): రోడ్ల అభివృద్ధి పేరుతో పచ్చని చెట్లను తొలగిస్తున్నారని, ఇది దారుణమని కాంగ్రెస్ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పాతబస్టాండు సర్కిల్ రోడ్డులో దశాబ్దాల చరిత్రగల రాగిచెట్టును మున్సిపల్ అధికారులు, సిబ్బంది రాత్రికిరాత్రే తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

వంద శాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలి: డీఏవో

శిరివెళ్ల, ఫిబ్రవరి 20: పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ, ల్యాండ్ లింకేజ్ పెండింగ్‌లో ఉన్న రైతులు వంద శాతం ఈ-కేవైసీని పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. మండలంలోని గోవిందపల్లె ఆర్బీకేలో జరుగుతున్న ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. రైతులు ఈ-కేవైసీని ఓటీపీ, ఫేస్ యాప్, సీఎస్‌సీ కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, టెక్నికల్ ఏవో ఆయుబ్ బాషా, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి


డోన్, పలుకూరు, శిరివెళ్లలో భీష్ముడి చిత్రపటానికి పూజలు చేస్తున్న గంగ పుత్రులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 20: పట్టణం సమీపంలోని గంగమ్మ గుడి ప్రాంతంలో గంగ పుత్రుల సంఘం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గంగమ్మ తల్లికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భీష్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగ పుత్రుల సంఘం గౌరవాధ్యక్షుడు సప్తశైల రాజేష్, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మాధవస్వామి, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకుడు నిత్యతృప్తదాస్ తెలిపారు. మంగళవారం వేణుగోపాలస్వామి రుక్మిణీ సత్యభామ అమ్మవార్లకు అభిషేకం చేసి వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. భక్తులు గీతా పారాయణం చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

బేతంచెర్ల: మండలంలోని గ్రామాల్లో, పట్టణంలో భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. బేతంచెర్లలోని తెలుగు రంగయ్య స్వగృహంలో గంగ పుత్రుల అధ్యక్ష, కార్యదర్శులు తెలుగు వెంకటరమణ, ఎల్లయ్యలు భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డా.సాగరిక, చరణ్‌రాజు చేతుల మీదుగా రోగులకు పండ్లు బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు మద్దిలేటి, రంగన్న, రాముడు, మద్దయ్య, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, శ్రీను, పరమేష్ పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో గంగపుత్రుల ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలుకూరులో భీష్ముడి చిత్రపటానికి గంగపుత్రులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భీష్ముడి గొప్పదనాన్ని గురించి వక్తలు వివరించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో మంగళవారం వేద పండితుడు పెద్దశాస్త్రి, ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ల ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమాన్ని చేశారు. భీష్మ ఏకాదశి విశిష్టత గురించి వేద పండితులు భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: శిరివెళ్లలోని తెలుగుపేటలో మాజీ ఎంపీటీసీ, బెస్త సాధికార సంఘం నాయకుడు కొండబోయిన బాలచంద్రుడు ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీష్మ పితామహుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని విష్ణు సహస్ర నామ జపం చేశారు. అనంతరం భీష్మ పితామహుడు అంపశయ్యపై పాండవులకు బోధించిన ప్రవచనాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొండబోయిన రామకృష్ణ, కృష్ణమోహన్, హరికృష్ణ, బాల తానీషా, రమణ, ధీరజ్, జగదీష్, లింగమయ్య, శివానంద పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.50వేలు విరాళం


విరాళం అందజేస్తున్న దాత

బేతంచెర్ల, ఫిబ్రవరి 20: బేతంచెర్ల-బనగానపల్లె రహదారిలోని చాకిరేవు సమీపంలో వెలసిన పుట్టా పెద్దమ్మ ఆలయాభివృద్ధికి ముసలాయ చెరువు గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి అనే దాత రూ.50వేలు ఆలయ నిర్వహ కుడు రామకృష్ణకు మంగళవారం అందజేశారు. దాత వెంక ట్రామిరెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మసీదుకు..

ఆళ్లగడ్డ: పట్టణంలోని పాతమసీదు అభివృద్ధి కోసం పట్టణానికి చెందిన మహమ్మద్ రఫి రూ.10 వేలు విరాళాన్ని మత పెద్ద మహమ్మద్ సాధిక్‌కు మంగళవారం అందించారు. రంజాన్ మాసంలో ప్రార్థనలు చేసుకునేందుకు వచ్చే ముస్లింలకు సౌకర్యాలు ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హుసేన్‌బాషా, ముస్లింలు పాల్గొన్నారు.

జ్వాలా లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 20: మండలంలోని తిప్పారెడ్డిపల్లె గ్రామంలో పార్వేట ఉత్సవ పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వామికి మంళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా తిప్పారెడ్డిపల్లె గ్రామంలో తలెపుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొని పల్లకి మోశారు. గురు ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన పీఈటీ

సంజామల, ఫిబ్రవరి 20: జాతీయ స్థాయి పోటీల్లో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాషా ప్రతిభ కనబరచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను అభినందించారు. మహారాష్ట్రలోని పూణేలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొన్న బాషా హైజంప్‌లో 4వ స్థానం, జావెలెన్ త్రోలో 5వ స్థానంలో నిలిచారు. గ్రామ నాయకులు పెం డేకంటి కిరణ్‌కుమార్, గ్రామస్థులు బాషాను అభినందించారు.

‘ఖాతాదారులకు మెరుగైన సేవలు’

చాగలమర్రి, ఫిబ్రవరి 20: ఏపీజీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని రీజినల్ మేనేజర్ టీవీ రమణ అన్నారు. మంగళవారం చాగలమర్రి ఏపీజీబీ బ్యాంకును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మేనేజర్ హరికిషోర్‌రెడ్డి, ఎఫ్‌వో వెంకటేష్ ఉన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

ఆరుగురికి తీవ్ర గాయాలు

రుద్రవరం, ఫిబ్రవరి 20: ఆళ్లగడ్డ మండలంలోని శాంతినగరం గ్రామం వద్ద ఆటో బోల్తా పడి తిరుపతయ్య (40) మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. కోవెలకుంట్ల మండలం లింగాల గ్రామంలో మిరపకాయల కోతకు వెళ్లిన రుద్రవరం గ్రామానికి చెందిన 12 మంది ఆటోలో తిరిగి వారి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే ఆటో ముందు టైరు పేలటంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలోని ఏడుగురు తీవ్రంగా గాయప డ్డారు. వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో తిరుపతయ్య చికిత్స పొందుతూ మృతి చెందారు. రూరల్ ఎస్ఐ నరసింహులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘న్యాయం చేయాలి’


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా అర్చకులు

దొర్నిపాడు, ఫిబ్రవరి 20: న్యాయం చేయాలని మండలంలోని చాకరాజు వేముల గ్రామంలోని మహిళా అర్చకులు సరస్వతి, పద్మ కల్యాణి కోరారు. మంగళవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమ ఇంటి పారులో హక్కు లేదంటూ ఇంటి పక్కన వ్యక్తి అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సమస్య పరిష్కారమయ్యే వరకు ఇరువురు గోడజోలికి వెళ్లకూడదని చెప్పారు. ఎండకు మహిళా అర్చకులు సొమ్మసిల్లి పడిపోవడంతో వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలపై ఆగ్రహం

డోన్(రూరల్), ఫిబ్రవరి 20: మాజీ మంత్రి కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలపై డోన్ ఏపీఎంఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి స్పందిస్తూ కొడాలి నాని చేసిన వ్యాఖ్యలు దారుణమని డోన్ ఏపీఎంఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డె నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి జిలాని, గౌరవ సలహాదారు శివరామాచారి ఖండించారు. డోన్ ఏపీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కొడాలి నాని ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 అధిపతులు రాప్తాడు సిద్ధం సభలో ఉండింటే దాడి మరింత తీవ్రంగా ఉండేదని చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటని అన్నారు. కొడాలినాని తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నాయకుడిపై కత్తితో దాడి

రుద్రవరం, ఫిబ్రవరి 20: మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సౌరెడ్డిపై అదే గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి కత్తితో దాడి చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలో సోమవారం రాత్రి ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. బాధితుడు సౌరెడ్డి ఫిర్యాదు మేరకు జగదీశ్వర్‌రెడ్డిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

బోల్టాలు ఊడిపోవడంతో ఆగిన బస్సు

రుద్రవరం, ఫిబ్రవరి 20: నంద్యాల- రుద్రవరం ఆర్టీసీ బస్సుకు చెందిన జాయింట్ వీల్, కట్టల బోల్టాలు ఊడిపోవడంతో కొండమాయపల్లె సమీపంలో రోడ్డుపైన మంగళవారం బస్సు ఆగిపోయింది. రుద్రవరం చేరకుండానే మధ్యలోనే ఆగిపోవడంతో ప్రయాణికులు ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. సామర్థ్యం ఉన్న వాహనాలను వాహనాలను నడపాలని ప్రయాణికులు కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

రుద్రవరం, ఫిబ్రవరి 20: పేరూరు గ్రామం వద్ద వకుళానదిపై బ్రిడ్జి నిర్మాణానికి మంగళవారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి భూమి పూజ చేశారు. శిరివెళ్ల మండలంలోని గ్రామాల నుంచి రుద్రవరం మండలంలోని గ్రామాలకు అనుసంధానంగా బ్రిడ్జి నిర్మిస్తున్నామని వారు చెప్పారు. ప్రాజెక్టు డీఈ వెంకటసుబ్బయ్య, తిరుపతిరెడ్డి, బాలనాగిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి..

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం, ఆర్.పాంపల్లె గ్రామాల మధ్య లింకురోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర సాగునీటి పారుదల సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి భూమిపూజ చేశారు. గ్రామం నుంచి దొన్నెపాడు లింకు రోడ్డు వరకు ఏడు కి.మీ. మేర రోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. వైసీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ సొసైటీ చైర్మన్ పల్లె మహేశ్వర్‌రెడ్డి, శివానంద, బోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కర్రప్రసాదరెడ్డి పాల్గొన్నారు.